


నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 5 మార్చి 2026 పేజీలు 8


# పొన్నం బాలాజీ దాతృత్వం



- గుమ్మడిదుర్రులో ఎస్సీ శ్మశాన వాటికకు సొంత నిధులు
- ఎకరం పొలాన్ని ఎస్సీ శ్మశానానికి కేటాయించిన వైనం
- రాజకీయం రాజకీయమే... సేవ సేవేనంటున్న పొన్నం బాలాజీ
- పొన్నం బాలాజీని శాలువాలతో సత్కరించిన గ్రామస్తులు

**పెనుగంచిప్రోలు, మేజర్ న్యూస్ :** మండలంలోని గుమ్మడిదూరు గ్రామంలో ఎన్నో ఏళ్ళు తరబడి స్మశానం లేక ఎస్సీలు అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గుమ్మడిదురు వాసి నక్క వెంకట్రావు (జర్నలిస్ట్) పోలంపల్లి ప్రాజెక్టు చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు పొన్నం బాలాజీ దృష్టికి తీసుకొచ్చారు. ఆ సమస్యను విన్న పొన్నం బాలాజీ వెంటనే తన వంతు కృషిగా ఒక్క ఎకరం పొలం సొంత నిధులతో మిగతా 2లో

## దోమలపై దండయాత్ర

- స్ప్రాట్ మస్కిటో ఎలిమినేటర్ మెషిన్‌తో దోమల నివారణ చర్యలు
- కమిషనర్ ధ్యానచంద్ర

5 లో

## కుంభాభిషేక మహా క్రతువుకు ఘన ఏర్పాట్లు..

ఆధునిక సాంకేతికతతో భక్తుల భద్రతకు భరోసా
అన్న ప్రసాదం, లడ్డూ ప్రసాదానికి అదనపు ఏర్పాట్లు
ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

7



## ఫిట్‌గా ఉంటేనే అన్నింటా ఫస్ట్‌గా ఉంటాం..

- ఆరోగ్యవంతమైన ఉద్యోగులే సమర్ధవంతమైన పాలనకు బలం
- శారీరక దృఢత్వం.. మానసిక ప్రశాంతతకు మార్గం
- మానసిక ఆరోగ్యంతోనే మంచి ఆలోచనలు వస్తాయి
- మహిళా ఉద్యోగుల సామర్థ్యానికి ప్రతీకగా క్రీడా పోటీలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు



**విజయవాడ బ్యూరో, మార్చి 04, మేజర్ న్యూస్ :** శారీరక, మానసిక ఆరోగ్యం ప్రతిఒక్కరి జీవితంలో అత్యంత కీలకమని.. ఫిట్‌గా ఉంటేనే వ్యక్తిగత జీవితం, వృత్తి జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించగలమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ మహిళా ఉద్యోగుల విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఏపీ ఎన్‌జీజీవో మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ నిర్మలకుమారి, కన్వీనర్ పి.మాధవి తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మనం చేసే పనిద్వారా మంచి ఫలితాలు సాధించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమేనని.. మిగతా 2లో...

## ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య రక్షణ

- ఇది చారిత్రాత్మక నిర్ణయం
- గత ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఖర్చు చేసింది కేవలం 18 శాతమే...
- గన్నవరంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ట్రామా సెంటర్ ఏర్పాటు చేయండి.
- విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం, మార్చి 4, మేజర్ న్యూస్ :** ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య రక్షణ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌ను సమర్థించారు. కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 25 లక్షల రూపాయల వరకు ఆరోగ్య రక్షణ కల్పించాలనే యూనివర్సల్ హెల్త్ కవరేజ్ నిర్ణయం చారిత్రాత్మకమని ఆయన కొనియాడారు. కేవలం ఇన్సూరెన్స్ పథకాలే కాకుండా, నాణ్యమైన వైద్యులు, అత్యాధునిక ఆసుపత్రులు, సమర్థవంతమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఉన్నప్పుడే ప్రజలకు మిగతా 2లో...

## సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మూలపాడు క్రికెట్ స్టేడియం



- స్టేడియంలో క్రీడాకారులకు వసతుల కల్పన దిశగా చర్యలు చేపట్టాం
- 50 అదనపు రూములు నిర్మాణానికి నిర్ణయం
- స్టేడియాన్ని పరిశీలించిన ఎంపీ, కార్యదర్శి సానా సతీష్ బాబు వెల్లడి

2

# పొన్నం బాలాజీ దాతృత్వం









(మొదటిపేజీ తరువాయి)

కొనుగోలు చేసి స్మశాన వాటిక కేటాయిస్తాను అని హామీ ఇవ్వడమే కాకుండా, నిధులు కూడా ఇచ్చేయడంతో ఎస్సీ కుల పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. శభాష్ పొన్నం బాలాజీ అంటూ పలువురు శాలువాతో సత్కరించారు. అనంతరం పొన్నం బాలాజీ మాట్లాడుతూ దూర ప్రాంతంలో ఉన్న తన కులం పట్ల ఎంతో మమతా అనురాగాలు కలిగిన వ్యక్తి నక్క వెంకట్రావు(జర్నలిస్ట్) అని, ఈ శ్మశాన సమస్యను తీసుకొని వచ్చి దీనిని ఎలాగైనా మీరు పరిష్కరించాలని అంటే నేను ఏదో రకంగా చేస్తా అని నక్క వెంకట్రావు(జర్నలిస్ట్)కి హామీ ఇచ్చాను. ఇప్పుడు ఎకరం పొలాన్ని ఎస్సీ కులానికి స్మశాన వాటిక ఇవ్వడం జరిగిందని, అదేవిధంగా గ్రామంలో రాజకీయం కేవలం ఎలక్షన్ ఉన్నప్పుడు మాత్రమే చేయాలని, మిగతా రోజుల్లో గ్రామ అభివృద్ధికి అందరు కూడా సహకరించాలని, వీలైతే అభివృద్ధిలో పోటీ పడదాం కానీ కుట్రలు పన్నటం గొడవలు పెట్టడం అలాంటి వాటిల్లో తాను దూరంగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా పొన్నం బాలాజీ – విజయలక్ష్మి దంపతులకు ఎస్సీ కుల పెద్దలు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పొందూరు నాగేశ్వరరావు, నక్క వెంకట్రావు(జర్నలిస్ట్), యార్లగడ్డ విశ్వనాథం, కంచెటి రాంబాబు, మండెపూడి రామ్మోహన్ రావు, నక్క సుధాకర్, నక్క చిన్న పుల్లయ్య, ఆలూరి శ్రీనివాసరావు, పలువురు గ్రామ రైతులు, ఎస్సీ సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు



# ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

నిజమైన భరోసా లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. 2019-24 మధ్య కాలంలో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేశామని గొప్పలు చెప్పుకున్న వైసీపీ, కేవలం పేపర్ మీద ప్రకటనలకే పరిమితమైందని ధ్వజమెత్తారు. కాలేజీల నిర్మాణం కోసం 8,480 కోట్లు అవసరమని అంచనా వేసి, కేవలం 1550 కోట్లు మాత్రమే ఖర్చు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మిగిలిన 6,152 కోట్లు ఖర్చు చేయకుండా కాలేజీలను గాలికి వదిలేసి, మరోవైపు సలహాదారులకు 650 కోట్ల రూపాయలు, రిషికొండ ప్యాలస్ నిర్మాణానికి వందల కోట్లు ఖర్చు చేయడం వారి ప్రాధాన్యతలను తెలియజేస్తోందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిచిపోయిన మెడికల్ కాలేజీల అభివృద్ధి కోసం 787 కోట్లు విడుదల చేసిందని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిబద్ధతకు నిదర్శనమని వెంకట్రావ్ పేర్కొన్నారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో 2019-24 మధ్య 5,500 కోట్లు ఖర్చు చేసి 17 మెడికల్ కాలేజీలను ఆపరేషన్‌లోకి తెచ్చారని, ఫైనాన్షియల్ సస్టైనబుల్ మోడల్‌ను వారు అనుసరించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిపోయిన 11 వైద్య కళాశాలలను పూర్తి చేయడానికి 11,000 కోట్లు, వాటి వార్షిక నిర్వహణ కోసం ఏటా 2700 కోట్లు అవసరమవుతాయని, పదేళ్ల కాలంలో దాదాపు 27,500 కోట్లు వెచ్చించే ఆర్థిక పరిస్థితి రాష్ట్రానికి లేనందునే దూరదృష్టితో పీపీపీ మోడల్‌ను ఎంచుకున్నామని ఆయన వివరించారు. పీపీపీ మోడల్ అనేది కొత్తదేమీ కాదని, మణిపాల్ కస్తూరిభాయ్ మెడికల్ కాలేజ్, రామచంద్ర మెడికల్ కాలేజ్, అమృత ఇన్స్టిట్యూట్ వంటి ప్రముఖ సంస్థలు దశాబ్దాలుగా ఇదే పద్ధతిలో నడుస్తున్నాయని తెలిపారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి ఎన్నో రాష్ట్రాలు ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయని, అవగాహన లేకుండా వైసీపీ నేతలు సంతకాల సేకరణ చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. పీపీపీ విధానంలో భూమి ప్రభుత్వం వద్దే ఉంటుందని, సీట్ల కేటాయింపు, ఫీజు నియంత్రణ, రిజర్వేషన్ పాలసీలు అన్నీ ప్రభుత్వ పర్యవేక్షణలోనే జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, పనుల్లో వేగం పెరిగి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చివరగా తన నియోజకవర్గం లో రోడ్డు ప్రమాదాల బారిన పడి అనేక మంది మరణిస్తున్నారని వారిని ఆదుకోవడానికి ఒక ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, అలాగే ఒక డయాలిసిస్ సెంటర్‌ను కేటాయించాలని మంత్రిని కోరారు.తన నియోజక వర్గంలో 65 వేల మందికి సిహెచ్సి పిహెచ్సి సెంటర్ ల ఆధ్వర్యం లో ఇంటి వద్దే రక్త పరీక్షలు నిర్వహించమని అలానే రాష్ట్ర వ్యాప్తంగా ఇంటి వద్దే రక్త పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఫిట్‌గా ఉంటేనే అన్నింటా ఫస్ట్‌గా ఉంటాం..



(మొదటిపేజీ తరువాయి)

అందుకే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర మాసోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటం సమర్థవంతమైన పాలనకు కీలకమని.. ప్రజలకు నాణ్య మైన సేవలు అందించాలంటే ఉద్యోగులు ఉత్సాహం, ఏకాగ్రత, సానుకూల దృక్పథంతో పనిచేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. మానసిక ప్రశాంతత ఉంటే నిర్ణయాలు స్పష్టంగా తీసుకోవచ్చని, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోవచ్చని వివరించారు. ఈ నేపథ్యంలో ఏపీ ఎన్‌జీజీవో మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం స్ఫూర్తిదాయకం, అభినందనీయమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**ఆడాలి.. ఆనందంగా ఉండాలి : శాప్ ఛైర్మన్ రవినాయుడు**

మహిళా ఉద్యోగులను చైతన్యవంతులను చేసి కొత్త ఉత్సాహంతో ముందు కెళ్లేలా చేసేందుకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. వ్యవస్థలు సజావుగా ముందు కెళ్తున్నాయంటే అందుకు ఉద్యోగుల సమర్థతే కారణమని, సమాజ హితం కోసం నిత్యం శ్రమిస్తున్న ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటం ముఖ్యమని అన్నారు. ఇందుకు క్రీడలు, నిత్య వ్యాయామం దోహదం చేస్తా యన్నారు. ఒత్తిడిని అధిగమించి కొత్త ఉత్సాహంతో చేస్తున్న పని ద్వారా మంచి ఫలితాలు సాధించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి ఆరోగ్య ఆంధ్ర, క్రీడాంధ్ర సాధన దిశగా దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. గౌరవ పీఎం ఫిట్ ఇండియా ద్వారా ప్రతిఒక్కరినీ భాగస్వాములను చేస్తున్నారని రవినాయుడు అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ క్రీడలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని.. భవిష్యత్తులో గౌరవ ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్ తదితర అధికారులతో మూడు నాలుగు రోజులపాటు క్రీడా పోటీలను నిర్వహించాలనే యోచనలో ఉన్నట్లు రవి నాయుడు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై ఈ ప్రభు త్వం దృష్టిసారిస్తోందని.. ఇది ఉద్యోగులు గౌరవంగా జీవించేలా చేయాలన్న తపన ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ... క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, ఆత్మవిశ్వాసం వంటి గుణాలను పెంపొందిస్తాయని చెప్పారు. కార్యాలయ పనులతో పాటు ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. మహిళా ఉద్యోగులు ప్రతి రంగంలోనూ ముందంజలో ఉన్నారని, క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఇటువంటి కార్యక్ర మాలు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంపొందించడంతో పాటు పరస్పర అవగాహన, ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఏటా అంతర్జాతీయ మహి ళా దినోత్సవం సందర్భంగా మహిళా విభాగం ఆధ్వర్యంలో విజయవంతంగా క్రీడా పోటీలను నిర్వహించడంలో భాగస్వాములమవుతున్న ప్రతిఒక్కరికీ అభి నందనలు తెలియజేస్తున్నట్లు విద్యాసాగర్ అన్నారు.

ఏపీ ఎన్‌జీజీవో మహిళా విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ నిర్మలకుమారి మాట్లాడుతూ.. ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంతో ఏటా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ బాధ్యతల మధ్య సమతుల్యత సాధించాలంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

కార్యాలయాల్లో ఏర్పడే ఒత్తిడిని తగ్గించడంలో క్రీడలు కీలక పాత్ర పోషి స్తాయని, ఉద్యోగుల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. శారీరకంగా దృఢంగా ఉంటే పనితీరు మెరుగుపడుతుందని, మానసిక ప్రశాం తతతో తీసుకునే నిర్ణయాలు శాఖ ప్రతిష్ఠను పెంచుతాయని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను చాటుతున్న ఈ సమయంలో, క్రీడా వేదికల ద్వారా వారి సామర్థ్యాన్ని మరింత వెలుగులోకి తీసు కురావడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని నిర్మలకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీజీవో మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పి.మాధవి ప్రతినిధులు కె.శివలీల, వి.శాంతిశ్రీ, బి.జానకి, ఎం.సరస్వతి, బి.విజయశ్రీ, సీహెచ్ నాగమల్లేశ్వరి, ఎస్.దివ్య, వి.సురేఖ, పి.తులసీరత్నం పాల్గొన్నారు.



## సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మూలపాడు క్రికెట్ స్టేడియం

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలోని మూలపాడు క్రికెట్ స్టేడియాన్ని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా తీర్చిదిద్దనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయవాడ ఎంపీ చిన్ని, అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. మూలపాడు క్రికెట్ స్టేడియాన్ని ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ ప్రతినిధులు, ఆర్కిటెక్ట్, ఇంజనీర్లతో కలిసి కేశినేని చిన్ని, సానా సతీష్ బాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులుగా ఉన్న ఎంపీ కేశినేని శివనాథ్, సానా సతీష్ బాబు మాట్లాడుతూ మూలపాడు క్రికెట్ స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కృత నిశ్చయంతో ఉందన్నారు. రానున్న కాలంలో స్టేడియాన్ని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా తీర్చిదిద్ది స్టేడియం ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. స్టేడియంలో ఇప్పటికే రెండు మైదానాలు ఉన్నాయని క్రీడాకారుల సౌకర్యార్థం 50 అదనపు గదులను నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గిరీష్ డోంగ్రే, సీఈవో, సి ఎఫ్ ఓ డి. విజయభాస్కర్, జిఎం గేమ్ డెవలపర్ ఎంఎస్ కుమార్, జిఎం గ్రౌండ్స్ డి శివకుమార్, ఏసీ ఏ ప్రతినిధులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి..



## అపరిష్కృత సమస్యల పరిష్కారం వేగవంతం చేయండి

### ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీ ఎన్జీజివో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ విజ్ఞప్తి

**అమరావతి మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వం హయాంలో అపరిష్కృతంగా ఉన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం వేగవంతమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. నూతనంగా ఎన్నికైన అంజి జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. వేతన సవరణ కమిటీ చైర్మన్ నియామకం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు నియామకం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో సీఎం చంద్రబాబుని కలిసిన తరువాత మీడియాతో మాట్లాడుతూ పెండింగ్ డిఏలు, మధ్యంతర భృతి, పిఆర్సి కమిటీ నియామకం, ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్యలపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక, పెన్షనర్లు, ఔట్సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలోని వివిధ శాఖలలో ఖాళీలు భర్తీ వంటి కీలకమైన అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం స్పందన కోసం రాష్ట్రంలోని ఉద్యోగులందరూ ఎదురుచూస్తున్నారన్నారని ముఖ్యమంత్రి వివరించానన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ, పరిష్కారం కావలసిన అంశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు పెన్షనర్లకు డిఏ బకాయిలు మంజూరు చేయడం అట్లా ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థికపరమైన అంశాలతో పాటు ఆర్థికేతర అంశాలలో కూడా ప్రభుత్వం దశలవారీగా ఉద్యోగులకు న్యాయం చేస్తుందని ఆశాభావంతో ఉద్యోగులు ఉన్నారన్నారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో కనీసం నిర్నిత వ్యవధిలో జీతాలు కూడా పొందలేకపోయిన ఉద్యోగులందరూ ప్రస్తుత ప్రభుత్వంలో ఖచ్చితమైన సమయానికి జీతాలు పొందగలుగుతున్నారన్నారు. పెన్షనర్లకు క్వాంటం పెన్షన్ అన్యాయాన్ని సరిదిద్దాలని ముఖ్యమంత్రిని కోరానన్నారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి సావధానంగా వినడంతో పాటు ఉద్యోగుల ప్రయోజనాలపై ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, గత ప్రభుత్వం ద్వారా ఉద్యోగులకు ఎదురైన అన్ని ఇబ్బందులను ఒక్కొక్కటి పరిష్కారం చేసుకుంటూ వెళ్తున్నామని, బకాయిలను కూడా క్రమబద్ధంగా చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసిన ఏపిఎన్జీజీవోఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి రమణ,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.జగదీశ్వర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ రవికుమార్,ఎండి.జాని పాషా, ఎం కిరణ్ కుమార్ రాష్ట్ర కార్యదర్శులు యస్.బి.వి.రాంప్రసాద్, యల్.రజనీష్ బాబు, వివిధ జిల్లాల అధ్యక్షులు జి.రామ్మోహన్, జివి ఆర్ యస్ కిషోర్, బి శ్రీనివాసులు, ఆకునూరి శ్రీనివాసరావు, బి వెంకటేశ్వర్లు, యన్ టి ఆర్ జిల్లా సహ అధ్యక్షులు వి వి ప్రసాద్, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ జోనల్ అధ్యక్షులు ఎం రాజుబాబు, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# చీడపీడల యాజమాన్యంపై శిక్షణ



**మొవ్వ మేజర్ న్యూస్:** ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్రవేత్తల బృందం మండల పరిధిలోని వేములమడ గ్రామంలో పంటలో చీడ పీడల యాజమాన్యంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్నలో గులాబీ రంగు కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు అధికంగా ఆశించి నష్టం కలుగచేస్తున్నాయని, ఉనికి, ఉధృతి తెలుసుకోవడానికి ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, గొంగళి పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే క్లోరాంట్రనిలిప్రోల్ 60 మిలీ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రా. లేదా స్పైనోసాడ్ 60 మి.లీ. ఎకరానికి సుడులు లేదా మొవ్వ లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలని కేవీకే అధిపతి డా. సుధారాణి రైతులకు సూచించారు. అవసరాన్ని బట్టి 2 నుండి 3 సార్లు మందును మార్చి పిచికారీ చేయాలని, కాండం కుళ్ళు ఆశించకుండా తేమ శాతం చూసుకోవాలని ట్రైకోడెర్మ విరిడే వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేములమడ.సీతారామయ్య, శాస్త్రవేత్తలు రేవతి, మండల వ్యవసాయ అధికారి సురేష్ నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు కార్యక్రమం

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు కార్యక్రమం సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కార్మిక, కర్షక మధ్యతరగతి ప్రజలుమరియు వ్యవసాయ కూలీలు మహిళలు, విద్యార్థులు, యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పనిచేస్తుందని సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య అన్నారు.ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో ఏ కొండూరు మండలం గొల్లమందల గ్రామంలో సిపిఐ నాయకులతో కలిసి ఇంటింటికి సిపిఐ నిధి వసూళ్ల కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అనేకమైనటువంటి ఆటుపోట్లు ఎదుర్కొని నిత్యం ప్రజల సమస్యల పట్ల అవగాహన కల్పిస్తూ వాటికి పరిష్కార మార్గాలు చూపుతూ ఆందోళనలు ప్రజలతో నిత్య సంబంధాలు పెట్టుకుని వందేళ్ళ ప్రయాణంలో అనేకమైన విజయాలు సాధించిన చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు. ప్రతి ఇంటికి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారం చూపాలన్నదే పార్టీ యొక్క ముఖ్య ఉద్దేశమని కృష్ణయ్య తెలిపారు. కౌలు రైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వ్యవసాయ పనులు లేక పస్తులుంటున్నారని తిందామంటే తిండి లేక కొందామంటే డబ్బులు లేక చేద్దామంటే పనులు లేక ఉన్నారని వారికి పనులు కల్పించాల్సిన బాధ్యత నేటి పాలకులపై ఉందని ఆయన అన్నారు. భూ యజమానుల వద్ద భూమి కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తే అన్నావృష్టి వల్ల పంటలు దెబ్బతినే అప్పుల పాలయ్యారని అప్పు తీసుకున్న బ్యాంకు రుణాల కోసం బ్యాంకుల వాళ్ళు ఏది ఇస్తున్నారని అప్పులు తీరే మార్గం లేక అలమటిస్తున్నారని ఆయన అన్నారు.



కేంద్ర ప్రభుత్వం మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి విబి రాంజీ పేరుతో 125 రోజులు పని కల్పించామని గొప్పలు చెప్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వాలపై 40 శాతం బారం మోపారని అసలే ఆర్థిక భారంతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం విధించిన భారం మోయలేక చేసిన పనులకు డబ్బులు చెల్లించలేకపోతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆలోచించి మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కొనసాగించి వ్యవసాయ కూలీలకు కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని రోజుకు 600 రూపాయల కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు దాడి ఆదినారాయణ, సిపిఐ మండల కార్యదర్శి ముచింతల వెంకటేశ్వరరావు, తేళ్లూరు సంగీతరావు, వీరమల్ల సామేలు, తదితరులు పాల్గొన్నారు.




## 'ద వన్ అండ్ వోన్లీ'ని ఆవిష్కరించిన బ్లెండర్స్ ప్రైడ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్

**గుంటూరు మేజర్ న్యూస్ :** తరతరాల కోసం విజయ ఆలోచనను మెరుగుపరిచిన సాంస్కృతిక దిగ్గజం బ్లెండర్స్ ప్రైడ్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, తమ కొత్త కాంపైన్ 'ద వన్ అండ్ ఓన్లీ'ను ఆవిష్కరించింది. కొత్త కాంపైన్ ముగ్గురు నాయకులతో చిత్రీకరించబడింది. అవంతి నాగ్ రథ్, కిరణ్ దీప్ చహల్, మహికా శర్మ.. ప్రతి ఒక్కరు బ్రాండ్ భిన్నమైన రూపాన్ని ప్రదర్శిస్తారు. అవంతి తన నిర్భయమైన ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వంతో అందాన్ని ప్రకాశింపచేస్తుంది. అందరూ ఎంతోమంది సమానులతో నిండిన ఆశావహ ప్రపంచంలో కిరణ్ దీప్ తన ఆకర్షణీయమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన ఉనికితో కోరికను కలిగిస్తుంది. మహీకా ప్రశాంతమైన ఆరాధన, నిశ్శబ్దమైన సొగసుదనంతో ఆశ్చర్యాన్ని ప్రేరేపిస్తుంది. కాబట్టి బ్రాండ్ అదే శ్రేణిలో తక్కిన వారి కంటే మెరుగైన నాణ్యతతో వారి చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరిని లోపరహితంగా ఆజ్ఞాపిస్తుందని పెర్నాడ్ రికార్డ్ ఇండియా ఛీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ దేబాశ్రీ దాస్ గుప్తా పేర్కొన్నారు.

## విద్యార్థుల మృతదేహాలకు శ్రద్ధాంజలి ఘటించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ



**గన్నవరం, మార్చి 4, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చిక్కవరం గ్రామ శివారు కండ్రిక గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటనపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సుందరయ్య చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. మృత విద్యార్థుల మృతదేహాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ చర్యలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బి.బి.గూడెం గ్రామానికి చెందిన బైపాస్ శస్త్రచికిత్స చేయించుకున్న బచ్చు సుబ్బారావును పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, స్థానిక సమస్యలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించి గ్రామానికి సంబంధించిన పలు అంశాలను తెలుసుకున్నారు.

## ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే మూడు సెంట్ల భూమి ఇవ్వాలి : మాజీ ఎమ్మెల్యే కైలే



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు శాసనసభ్యునికి చిత్తశుద్ధి ఉంటే ఏదైతే ఎలక్షన్ ముందు 3సెంట్లు భూమి ఇస్తామని అన్నారో ప్రజలకు ఇచ్చి ఆ మాట నిలబెట్టుకోవాలని మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ సవాల్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక మీడియా ప్రతినిధులకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. వచ్చే సోమవారం ధర్నాలో మీ ఇసుక దందాలు, మీరు చేసే దోపిడీలు బయట పెడతామని హెచ్చరించారు. రానున్న పంచాయతీ ఎన్నికలలో ప్రజలను మాయ చేసేందుకు ఇంటి స్థలాలు డ్రామా మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. ఎవరినో తీసుకొచ్చి మాయమాటలు చెప్పించడం కాదని, దమ్ముంటే తనపై ఉన్న అవినీతిని నిరూపించాలని సవాల్ విసిరారు. ప్రస్తుత ఎమ్మెల్యే లాగా ఇసుక, రేషన్ బియ్యం, ఉద్యోగాలలో వాటాలు తీసుకోలేదని స్పష్టం చేశారు. ఇంత వరకు తన మీద ఎటువంటి అవినీతి మచ్చ లేదని, దమ్ముంటే నిరూపించుకోవాలని ఎమ్మెల్యేకు ఛాలెంజ్ చేస్తున్నానన్నారు.



## పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

**మొవ్వ మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆంధ్ర ప్రదేశ్ భూమి హక్కులు పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం క్రింద రీసర్వేచేసిన గ్రామాలలో ప్రభుత్వ చిహ్నంతోకొత్తపాస్ పుస్తకాలను పంపిణీ చేపట్టారు. దీనిలో భాగంగానే మండలంలోని కూచిపూడిలో 286 "కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను బుధవారం అధికారులు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ 19నెలల కాలంలోరైతుల ప్రగతేద్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని గత ప్రభుత్వం రైతుల పాస్ పుస్తకాలపై సొంత ఫోటోలను ముద్రించి ఎటువంటి ఉపయోగం లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలను నిర్వీర్యం చేసిందని అతిథిగా పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ డి. శివ రామయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అందించిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి,ఆర్ ఐ ఏ. విజయ దుర్గ, సీని యర్ అసిస్టెంట్ ఎల్ రామ మోహనరావు, పంచాయితీ కార్యదర్శి కే. అంక బాబు, విఆర్ఓ ఎం.ఖాసిం పలువురు రైతులు పాల్గొన్నారు.

## శ్రీ కొండలమ్మ ఆలయంకు 10వేల ప్రసాద క్యారీ బాగ్స్

### సిఎంఆర్ షాపింగ్ మాల్, మచిలీపట్నం వితరణ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి శ్రీ అమ్మవారి మహా ప్రసాద క్యారీ బ్యాగులు 10,000 సీఎంఆర్ మచిలీపట్నం షాపింగ్ మాల్ యాజమాన్యం అందించినారు. గత సంవత్సరం కూడా 15000 క్యారీ బ్యాగులను అందించడం జరిగింది. సీఎంఆర్ సిబ్బందికి దేవస్థానం చైర్మన్ ఈడే మోహన్, కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు వారిని శేష వస్త్రంతో సత్కరించి శ్రీ అమ్మవారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు.

## ఘనంగా జాతీయ భద్రత దినోత్సవ నిర్వహణ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** స్థానిక గుడ్లవల్లేరు ఏ.ఏ.ఎన్.ఎం & వి.వి.ఆర్.ఎస్.ఆర్. ఇం.మీ. హై స్కూల్లో జాతీయ భద్రత దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుడ్లవల్లేరు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సమాజంలో ముఖ్యంగా ఆడపిల్లలు అనేక రకాల లైంగిక వేధింపులకు గురవుతున్న దౌర్భాగ్యకర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఇలాంటి దుశ్చర్యల నుండి తమను తాము రక్షించుకోవాలంటే ముందుగా మనోధైర్యం, ఆత్మవిశ్వాసం అవసరమని సూచించారు. చదువుతో పాటు కరాటే వంటి స్వీయరక్షణ విద్యలను కూడా నేర్చుకోవడం ద్వారా విద్యార్థినులు శారీరకంగా, మానసికంగా బలంగా మారగలరని వివరించారు. అపరిచితులతో వ్యవహరించే సమయంలో జాగ్రత్తలు పాటించడం, అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే పెద్దలకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఏ. కుంజుమాన్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి భద్రతా అవగాహన అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ధైర్యం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతాభావం పెంపొందించే కార్యక్రమాలను పాఠశాల తరచుగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా స్థాయి పార్లమెంటు




**మైలవరం, మేజర్ న్యూస్ :** స్థానిక లకి రెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో "వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2026" కార్యక్రమాన్ని మార్చి 4 వ తేదీన లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యన్.యస్.యస్. యూనిట్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె అప్పారావు మాట్లాడుతూ ఈ యూత్ పార్లమెంట్--2026లో 18 నుంచి 25 సంవత్సరాలు వయస్సు కలిగిన ఎన్టీఆర్ జిల్లా లో ఉన్నా వివిధ కళాశాలకు చెందిన యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని అయన తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా యువజన అధికారి సుంకర రాము మాట్లాడుతూ "50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ: లెసన్స్ ఫర్ ఇండియన్ డెమొక్రసీ" అంశంపై విద్యార్థులు ప్రసంగించారు అని అయన తెలిపారు., ఎన్టీఆర్ జిల్లా నుంచి ప్రతిభ కనబరిచిన 5 గురు యువతను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా శివ హరి ప్రసాద్,,ఎన్టీఆర్ జిల్లా యువజన అధికారి సుంకర రాము, వినోద్ కుమార్, యస్.ఉమామహేశ్వర రెడ్డి, కళాశాల యన్.యస్.యస్. వాలంటీర్స్ పాల్గొన్నారు.

**పోటీల్లో విజేతలు వీరే..**

ప్రసంగ పోటీల్లో పి.స్నేహ బిందు(ఎల్ బి ఆర్ సి ఈ), కె. యుక్త శ్రీ అన్నపూర్ణ (ఎల్ బి ఆర్ సి ఈ), ఏ.లక్ష్మీ శ్రావ్య( ఎస్ ఆర్ కె టి), వెంకట ప్రకాష్(ఆంధ్ర లయోలా),షేక్.హాఫీజున్నిస (పిఎస్ సిఎంఆర్) నిలిచారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు.

# జనసేన లక్ష్యాలకు అనుగుణంగా సభ్యత్వ నమోదు పూర్తి చేయండి

### పార్లమెంటు సభ్యులు బాలశౌరి



**పామర్రు మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి విజ్ఞప్తి చేశారు. పామర్రు టౌన్లోని పాలశీతల కేంద్రంలో పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ అధ్యక్షతన జరిగిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సాధక్ (క్రియాశీలక వాలంటీర్ల)కు జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధక్ లు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదుపై ఆయన నాయకులకు, కార్యకర్తలకు సాధక్ లకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ,



కృష్ణాజిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ (డిసిఎంఎస్) ఛైర్మన్, జనసేన పార్టీ మచిలీపట్టణం ఇంచార్జి బండి రామకృష్ణ, మత్స్యకార రాష్ట్ర చైర్మన్ చిలకలపూడి పాపారావు, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి సత్యనారాయణ, పామర్రు నియోజకవర్గంలోని మండల అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, మచిలీపట్టణం పట్టణ అధ్యక్షులు గడ్డం రాజు, మచిలీపట్టణం మండల అధ్యక్షులు గళ్ళ తిమోతి, గ పార్టీ నాయకులు కొట్టే వెంకట్రావు, మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

**జనసేన పార్టీలో చేరిన వైసిపి సర్పంచ్, కార్యకర్తలు**

ఈ సందర్భంగా పెదపారుపూడి మండలం వైసిపి కి చెందిన కొర్నిపాడు గ్రామ సర్పంచ్ దూడల లోకేశ్వరి ఆధ్వర్యంలో 50 మంది జనసేన పార్టీలో చేరారు. మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రస్తుత పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

# కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తోంది

### యువనాయకులు మండలి వెంకట్రామ్

### మాజేరులో మినుములు, పెసల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తోందని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం చల్లపల్లి మండలం కొత్తమాజేరులోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో మార్క్ ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో మినుములు, పెసల కొనుగోలు కేంద్రాన్ని మార్క్ ఫెడ్ డీఎం విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ ప్రభుత్వం మార్కెట్లో మినుములు, పెసల ధరల నియంత్రణకు కనీస మద్దతు ధర ప్రకటించి, కొనుగోళ్ల ప్రారంభించినట్లు తెలిపారు. పెసలు క్వింటాలుకు రూ. 8,768లు, మినుములు క్వింటాలుకు రూ. 7,800లు ధర చెల్లిస్తుందని వివరించారు. ఈ సీజనులో ఇప్పటివరకు చల్లపల్లి మండలంలో రూ. 45కోట్లకు పైగా ధాన్యం సొమ్ము రైతు ఖాతాలకు జమ చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వ పెట్టుబడి సహాయం అన్నదాత సుఖీభవ ద్వారా మండలంలో 4,876 మంది రైతులకు రూ. 2.43 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ. 96లక్షలు అందించినట్లు తెలిపారు. డ్రోన్ల కొనుగోలుకు ప్రభుత్వం మూడు సంఘాలకు రూ. 29.40 లక్షలు సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. ఇవే కాకుండా సబ్సిడీపై మినుము విత్తనాలు, కలుపు మందులు, వేప నూనె, పురుగు మందులు అందించినట్లు తెలిపారు. మార్క్ ఫెడ్ డీఎం మురళీ కిషోర్ మాట్లాడుతూ మాజేరులో 300 ఎకరాల్లో పెసలు సాగు చేసిన నేపథ్యంలో ఈ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మినుములు, పెసల కొనుగోలు, సొమ్ము చెల్లింపుల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కే.మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ తోట కనకదుర్గ, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలశెట్టి బాల నాగేశ్వరరావు, సీఈఓ ఎస్.ఎస్.చక్రపాణి, గ్రామ ప్రముఖులు కళ్లేపల్లి లక్ష్మీనారాయణ, నారాయణ సేవా సమితి నిర్వాహకులు శ్రీకాంత్, గోపాలమిత్ర ఎఫ్.పీ.సీ చైర్మన్ మాలెంపాటి రంగారావు, లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి, కూటమి నాయకులు యడ్లపల్లి బుజ్జి, బొర్రా అగ్గిరాముడు, కమ్మిలి పెదబాబు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు బండి నాగార్జున, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ, ఆయా శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# దోమలపై దండయాత్ర

## స్పాట్ మస్కిటో ఎలిమినేటర్ మెషిన్‌తో దోమల నివారణ చర్యలు

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరంలో పెరుగుతున్న దోమల సమస్యలను నివారించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ "స్పాట్ మస్కిటో ఎలిమినేటర్" మెషిన్ను ట్రయిల్‌లో భాగంగా కరెన్సీ నగర్, 14వ సచివాలయంలో ఏర్పాటు చేశారని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. బుధవారం సాయంత్రం కరెన్సీ నగర్ లో ఏర్పాటు చేసిన ఈ యంత్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న దోమల సమస్యలను ఆధునిక సాంకేతికతతో నివారించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ అడుగులు వేస్తుందని అన్నారు. అందులో భాగంగా స్పాట్ మస్కిటో ఎలిమినేటర్ యంత్రం పనితీరు పరిశీలించారని, యంత్రం దోమల నివారణకు బాగా పనిచేస్తుందని, ఈ యంత్రాన్ని విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల ముఖ్యమైన ప్రదేశాలలో ఎక్కడైతే దోమలు ఎక్కువగా ఉన్నాయో, అక్కడ ఈ యంత్రాన్ని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మరో అడుగు ముందుకు వేస్తూ "స్పాట్ మస్కిటో సెన్సార్ ట్రాపర్" మెషిన్ను కూడా వాడేటట్టు చర్యలు తీసుకుంటున్నామని ఈ మెషిన్ ద్వారా దోమల గురించి పూర్తి విషయాలు తెలుస్తాయని, అది ఆడదోమ లేదా మగదోమా, మురికి నీళ్లలో నివసించే దోమ లేదా మంచినీరు లో ఉండే దోమ అని తెలుసుకొని ఆ దోమల వల్ల కలిగే డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, ఫైల్ ఏరియా వంటి వ్యాధులను నివారించవచ్చు అని అన్నారు. అటువంటి యంత్రాలు వివిధ ప్రదేశాలలో అమర్చడం వలన ఆ యంత్రాల పనితీరు ఒక డాష్ బోర్డు ద్వారా తెలుస్తుందని ఆ డాష్ బోర్డులో ఎన్ని మగదోమలు ఉన్నాయి ఎన్ని ఆడ దోమలు ఉన్నాయి ఎన్ని డెంగ్యూ కలిగించే దోమలు ఉన్నాయి అవి ఎక్కడున్నాయో తెలుసుకొని అక్కడ డ్రోన్ల ద్వారా స్ప్రేలు నిర్వహించి ఆ దోమలను నివారించి ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా విజయవాడ నగరపాలక సంస్థ అడుగులు వేస్తుందని తెలిపారు. దోమలపై దండయాత్ర చేసేందుకు విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బందితోనే కాకుండా ఆధునిక సాంకేతికత యంత్రాలతో దోమల నివారణకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాల నాయక్, బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్ & బీ శాఖ రహదారుల మరమ్మత్తులకు రూ.6.45కోట్లు సాస్కి నిధులు

### ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** నియోజకవర్గంలోని 16 ఆర్.అండ్.బీ రహదారుల అభివృద్ధి మరమ్మత్తులకు రూ.6.45కోట్లు సాస్కి నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. చల్లపల్లి నుంచి చిట్టూర్పు ప్రధాన రహదారి మరమ్మత్తులకు రూ.కోటి పది లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. చల్లపల్లి నుంచి నడకుదురు వెళ్లే ప్రధాన రహదారి 1400 మీటర్లు మరమ్మత్తులకు రూ.70లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. కోడూరు మండలంలోని విశ్వనాథపల్లి రోడ్డు మరమ్మత్తులకు రూ.30లక్షలు, సాలెంపాలెం రోడ్డు మరమ్మత్తులకు రూ.30లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. నాగాయలంక మండలం కమ్మనమోలు ప్రధాన రహదారి మరమ్మత్తులకు రూ.55లక్షలు, కమ్మనమోలు నుంచి సంగమేశ్వరం రోడ్డు మరమ్మత్తులకు రూ.40లక్షలు, ఘంటసాల మండలం యండకుదురు రోడ్డు మరమ్మత్తులకు రూ.55లక్షలు, అవనిగడ్డ మండలం కొత్తపేట - మాచవరం రోడ్డు మరమ్మత్తులకు రూ.40లక్షలు, కోడూరు మండలం ఉల్లిపాలెం రోడ్డు మరమ్మత్తులకు రూ.40లక్షలు, కోడూరు మండలం దింటిమెరక రోడ్డు మరమ్మత్తులకు రూ.35లక్షలు, అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెం రోడ్డు మరమ్మత్తులకు రూ.30లక్షలు, నాగాయలంక - కోడూరు రోడ్డు నుంచి పోటుమీద వెళ్లే రోడ్డు మరమ్మత్తులకు రూ.20లక్షలు మంజూరు అయినట్లు వివరించారు.

నాగాయలంక మండలం సొర్లగొంది-తలగడదీవి రోడ్డు మరమ్మత్తులకు రూ.30లక్షలు, మోపిదేవి మండలం నాగాయతిప్ప రోడ్డు మరమ్మత్తులకు రూ.10లక్షలు, ఘంటసాల మండలం చిట్టూర్పు జోడుగూడెం నుంచి ఘంటసాల వెళ్లే రోడ్డు మరమ్మత్తులకు రూ.15లక్షలు మంజూరు అయినట్లు వివరించారు. నాగాయలంక మండలం నంగేగడ్డ చోడవరం రోడ్డు మరమ్మత్తులకు రూ.35లక్షలు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ వివరించారు. తమ నియోజకవర్గంలో ఆర్.అండ్.బీ రోడ్ల మరమ్మత్తులకు సాస్కి నిధులు మంజూరు చేసిన ఆర్.అండ్.బీ శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇండ్ల గణనని కూడా చాలా తీవ్రంగా పరిగణించి శ్రద్ధతో చేయాలి





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వచ్చే మే నెల ఒకటో తేదీ నుండి చేపట్టనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని ఎలాంటి తప్పులు దొరలకుండా సజావుగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గణన చార్జ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన మొదటి దశ ఇండ్ల జాబితా, ఇండ్ల గణన జిల్లా చార్జ్ స్థాయి అధికారుల శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల మాదిరిగా ఈ ఇండ్ల గణన కార్యక్రమాన్ని కూడా చాలా తీవ్రంగా పరిగణించి శ్రద్ధతో చేయాలన్నారు. ఈ గణన కార్యక్రమంలో సరైన వివరాలు నమోదు చేయడం అందరి బాధ్యత అన్నారు. కొందరు ఇంటి యజమానులు కింది అంతస్తు నిర్మించుకున్న తర్వాత మొదటి అంతస్తు కొత్తగా నిర్మించుకుంటారని వాటికి నంబరు తీసుకోకుండా ఉంటారని చెప్పారు. అలాగే కొన్నిసార్లు అసైన్మెంట్, ప్రభుత్వ భూములకు ఇంటి స్థలాలుగా ఇచ్చి ఉన్న వాటికి నంబరు ఇవ్వవచ్చా లేదా అనే చాలామంది మీమాంసలో కూడా పడతారన్నారు. వాస్తవంగా మున్సిపల్ చట్టం ప్రకారం సూపర్ స్ట్రక్చర్ పన్ను దేనికైనా వేయవచ్చన్నారు. ప్రతి ఇంటి పన్ను చెల్లింపుదారునికి నంబర్ తప్పనిసరిగా ఎన్యూమరేటరు ఇవ్వడం చాలా ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఇండ్ల జాబితా గణన ఎలా చేయాలో పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. అప్పుడే వారు ఎన్యూమరేటర్లకు సరైన శిక్షణ ఇవ్వగలుగుతారన్నారు. ఎన్యూమరేటర్లను నియామకంపై త్వరలో స్పష్టత వస్తుందని ఆ తదుపరి వారిని నియమించుకుని వారికి కూడా శిక్షణా తరగతులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఎన్యూమరేటరు వారికి ఇచ్చిన ఇండ్ల జాబితా బ్లాక్ లో ఏ ఏ ఇండ్లు ఉన్నాయో సరి చూసుకోవాలన్నారు. వారికి ఒక ఎక్సెల్ షీట్ అందజేసి వారి పరిధిలో ఉన్న 700 నుంచి 800 ఇండ్లకు సంబంధించి నంబర్లు జాబితా ఇస్తే త్వరగా పని పూర్తవుతుందన్నారు. అందరితో కలిపి ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేస్తామని ఎవరికైనా ఏమైనా అనుమానాలు ఉంటే అందులో తెలియజేస్తే వివరణలతో నివృత్తి చేస్తామన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సంయుక్త కలెక్టర్ ఎం నవీన్, డిఆర్ఓ చంద్రశేఖర రావు, మచిలీపట్నం గుడివాడ ఆర్డీవోలు సాంబశివరావు, బాలసుబ్రమణ్యం, కే ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి, జడ్పి సిఈఓ కన్నమనాయుడు, డిపిఓ అరుణ, పలువురు తహసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# రుషికొండ భవంతులను స్టేట్ మ్యూజియంగా మార్చాలి

### అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** విశాఖపట్నం రుషికొండ భవంతులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ 'స్టేట్ మ్యూజియం'గా మార్చాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో భాషా సాంస్కృతిక, పర్యాటక శాఖపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా నిధుల కొరతతో స్టేట్ మ్యూజియం నిర్మాణం జరగలేదన్నారు. తెలంగాణా నుంచి రాష్ట్రానికి సంబంధించిన 50వేలకు పైగా పురావస్తు వస్తువులు రుషికొండ భవంతుల్లో ప్రదర్శనకు ఉంచి భావితరాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్ర తెలుసుకునే వేదికలా ఆయా భవనాలను స్టేట్ మ్యూజియంగా మార్చాలని ప్రతిపాదించారు.

# రాష్ట్ర స్థాయి యోగా ఛాంపియన్ షిప్‌లో యల్.బి.ఆర్.సి.ఈ విద్యార్థుల ప్రతిభ





**మైలవరం, మేజర్ న్యూస్ :** హైదరాబాద్, సరూర్ నగర్, ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి రెండవ వ ఎడిషన్ సి ఎం ఎస్ కప్ యోగా ఛాంపియన్ షిప్‌లో లకిరెడ్డి బాలిరెడ్డి కళాశాల విద్యార్థి సి.హెచ్.వాసు రాఘవకి అండర్ 25 బాలుర కేటగిరిలో కాంస్య పతకంను కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ కే.అప్పారావు తెలిపారు. అలాగే క్యూ ఐఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగినకిస్ఫెట్ ఫెస్ట్ లో బాలికల కేటగిరిలో కె.భవాని కాంస్య పతకంను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులను ట్రైనింగ్ ఇచ్చిన యోగా మాస్టర్ మాణిక్యాలరావు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

# క్లీన్ గుడ్లవల్లేరు సాధనలో శానిటేషన్ సిబ్బంది



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** క్లీన్ గుడ్లవల్లేరుకు పంచాయతీ ప్రజారోగ్య సిబ్బంది నడుం బిగించి పనిచేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు ఆదేశాలతో శానిటరీ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ నేతృత్వంలో ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకు గ్రామ ప్రధాన వీధులను, మధ్యాహ్నం కాలనీలను శుభ్రపరచి, బ్లీచింగ్ చేస్తూ, మురుగు కాలువల పూడికతీత జరిగిస్తున్నారు. అదేవిధంగా రోడ్ల మార్జిన్లలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్నారు. అలాగే ఇంటింటికీ వెళ్ళి తడి, పొడి చెత్తలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ పవన్ మాట్లాడుతూ చెత్తను రోడ్లపై పడవేయకుండా చెత్త బుట్టల ద్వారా చెత్త బండ్లకు అందించి సహకరించాలని గృహస్తులకు విజ్ఞప్తి చేసారు. శానిటేషన్ నిర్వాహకులు మురాల నరేష్, కాసాని శ్రీరామ్ ల కృషిని, ప్రజారోగ్య సిబ్బంది పనితీరును గ్రామస్తులు అభినందిస్తున్నారు.

# నేటి నుంచి శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ వార్షికోత్సవాలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ 28వ వార్షికోత్సవ వేడుకలను గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కాలేజీ యాజమాన్యం బుధవారం తెలిపింది. ఈ 3రోజుల పాటు సాంస్కతిక కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. కళాశాల ఛైర్మన్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగే 28వకళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి జేఎన్‌టీయూకే కాకినాడ వీసీ డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ ముఖ్య అతిథిగా రానున్నట్లు, మెరిట్ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు యాజమాన్యం తెలిపింది.

## స్వచ్ఛ రథంపై ప్రజలకు అవగాహన కల్పించండి




**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండలంలో స్వచ్ఛరథం పథకం విజయవంతం అయ్యే విధంగా గ్రామాలలో ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించడానికి పంచాయతీ అభివృద్ధి అధికారులు చర్యలు తీసుకోవాలని పెదపారుపూడి డిప్యూటీ ఎంపిడిఓ వంగా శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన పెదపారుపూడలో స్వచ్ఛరథంను ఆయన సందర్శించి సిబ్బందికి సూచనలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేదీన మండలంలోని భూషణగుళ్ల గ్రామం నుండి స్వచ్ఛరథం నెలవారీ షెడ్యూల్ మొదలైందన్నారు. షెడ్యూల్ దాఖలా ఆయా పిడిఓ లు గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా గ్రామ ప్రజలకు తెలిసే విధంగా చేయాలని కోరారు. పాత కాగితాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్ బాటిల్స్, గాజు సీసాలు, పాత ఇనుము సామాను, ఈ వేస్ట్ వస్తువులు, నూనె డబ్బాలు వంటి పొడి చెత్త గ్రామస్థులు వారి వారి ఇంటి వద్ద భద్రపరచుకుని స్వచ్ఛ రథం వచ్చినప్పుడు అందిస్తే ఆయా రకాల వారీగా తూకం వేసి నిర్దేశించిన రేట్ల ప్రకారం విలువ కట్టి ఆ మేరకు నిత్యావసర వస్తువులు స్వచ్ఛ రథం నుండి అందిస్తారని శ్రీనివాస్ తెలిపారు. దీంతో గ్రామాలు చెత్త రహితంగా ఉండడంతో పాటు ప్రజలకు ఆర్థిక లబ్ది, పంచాయతీకి పర్యావరణ రక్షణ సాధ్యం అవుతుందన్నారు. తాను రచించి గానం చేసిన స్వచ్ఛ రథం పాట రాష్ట్ర వ్యాప్తంగా వినియోగించబడడం ఆనందంగా ఉందని, పాట వ్రాయడానికి ప్రోత్సహించిన జిల్లా పంచాయతీ అధికారికి, మండలంలో పూర్తి సహకారం అందిస్తున్న ఎంపీడీఓ కు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## అప్పికట్లలో 8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అప్పికట్ల గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 8 మంది పేకాటరాయుళ్లను అదుపులోనికి తీసుకున్నారు. ఎన్నో రోజులుగా ఈ గ్రామ పరిధిలో విచ్చలవిడిగా జూద శిబిరాలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపణ చేస్తున్న నేపధ్యంలో ఎట్టకేలకు పోలీసులు స్పందించడం విశేషం. పామర్రు సీఐ వి.శుభాకర్ ఆదేశాల మేరకు పెదపారుపూడి ఎస్సై ఆర్.శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది ఈ పేకాట శిబిరంపై ఆకస్మిక దాడి నిర్వహించారు. పోలీసులు జూదరులను చుట్టుముట్టి పేకాటలో మునిగిపోయిన 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 2,220 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామ శివారును పేకాట అడ్డాగా మార్చిన వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితులలోనూ అవకాశం ఇవ్వబోమని, పేకాట వంటి చట్టవిరుద్ధ చర్యలపై ఇకపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై శ్రీధర్ బాబు హెచ్చరించారు.

## వేదాంతంకు భాగవతుల స్మారక అవార్డు



**మొవ్వ మేజర్ న్యూస్:** కూచిపూడి నాట్య లెజెండ్ కేంద్ర సంగీత నాటక అకాడమీ రవీంద్రనాథ్ ఠాగూర్ అవార్డు గ్రహీత నాట్యాచార్య భాగవతుల యజ్ఞ నారాయణ శర్మ స్మారక అవార్డు-2026ను కూచిపూడి నాట్య సార్వభౌమ నాట్యాచార్య వేదాంతం పాండురంగ శర్మకు బుధవారం బహుకరించారు. శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల సందర్భంగా నాట్య క్షేత్రం కూచిపూడి సిద్ధేంద్ర యోగి నాట్య కళావేదికపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణవేదికపై ఈ అవార్డును పలువురు అతిథుల సమక్షంలో బహుకరించారు. యజ్ఞ నారాయణ శర్మ కుమారుడునాట్యా చార్యభాగవతుల శ్రీనివాస్-భవాని దంపతుల ఆధ్వర్యంలో అవార్డు క్రింద 5 వేలనగదుతో పాటు శాలువా, జ్ఞాపికనుబహుకరించి ఘనంగాసత్కరించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు అసలైన భూ హక్కు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం

### ఏఎంసీ చైర్మన్ కొల్లూరి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రైతన్నకు అసలైన భూ హక్కు కల్పిస్తూ చారిత్రాత్మకమైన మార్పుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల భూములపై గత ప్రభుత్వం ఏ రకమైన పెత్తనం చలాయించారో మనమందరం చూశామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, రైతన్నకు అసలైన 'భూ హక్కు' కల్పిస్తోందని అన్నారు. పాస్‌బుక్ అనేది రైతు కష్టార్జితంతో కొనుక్కున్న భూమికి సాక్ష్యమని అది ప్రభుత్వ ఆస్తి కాదని, జగన్ ఫోటోలను తొలగించి, భారత ప్రభుత్వ రాజముద్రను గౌరవప్రదంగా ముద్రించడం రైతన్న ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం అని అన్నారు. సర్వే రాళ్ల పై మీ బొమ్మలు చెక్కించుకోవడానికి 700 కోట్లు తగలేశారని అన్నారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడూ టెక్నాలజీని రైతు క్షేమం కోసమే వాడతారని గతంలోనే 'మీ భూమి' పోర్టల్ తెచ్చింది ఆయనేనని ఇప్పుడు ఆధునిక పద్ధతుల్లో, ఎటువంటి వివాదాలు లేని భూ యాజమాన్యాన్ని రైతులకు అందిస్తామని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందిస్తూనే, వారి భూములకు రక్షణ కవచంలా కూటమి ప్రభుత్వం నిలుస్తున్నది పేర్కొన్నారు గత ప్రభుత్వం రైతులను ఓటు బ్యాంకులా చూసింది, కానీ కూటమి ప్రభుత్వం రైతులను రాష్ట్రానికి వెన్నెముకగా చూస్తోందని, రాబోయే రోజుల్లో వ్యవసాయాన్ని పండుగలా మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లూరి బసవేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు మండలి రామమోహన రావు, అవనిగడ్డ క్లస్టర్ ఇంచార్జ్ బండే రాఘవ, అశ్వరావుపాలెం నీటి సంఘాల అధ్యక్షులు దాసినేని శ్రీనివాస రావు, రాజశేఖర స్వామి దేవస్థానం చైర్మన్ ఘంటసాల రామమోహనరావు పార్టీ నాయకులు కంచర్ల ఆనంద్, నాగిడి రాంబాబు, ముళ్లపూడి శ్రీనివాసరావు, కొల్లూరి వాసు, కొండవీటి గోవింద్, నాగిడి సుబ్రహ్మణ్యం, పాటిబండ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకే ఎస్ ఎల్ సి 2.0.



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నాయకత్వ లక్షణాలు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకే స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి)2.0 నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ చందన బాబురావు, వైస్ ప్రిన్సిపల్ నాగలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక నారాయణ ఈ టెక్నో స్కూల్ లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా తన అభ్యాస పురోగతి, నైపుణ్యాలు, అకడమిక్ ప్రగతి, భవిష్యత్తు లక్ష్యాలను తల్లిదండ్రుల ముందు వివరించడంతోపాటు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించబడతాయని వారు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలపై విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు ఇలాంటి వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులకు నిరంతర మార్గ నిర్దేశం అందిస్తూ వారి ప్రతిభను వెలికి తీయడంలో పాత్ర పోషించారు అని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి విద్యార్థి కేంద్రిత కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్ విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల క్లస్టర్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, చాంప్స్ హెడ్ వాణి, ఏ.ఓ సుబ్రహ్మణ్యేశ్వరరావు,కోఆర్డినేటర్ లియోని, ఉపాధ్యాయులు, ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# "చదువే భవిష్యత్తుకు బాట" విశ్వకవి రజతోత్సవంలో పోలీసుల ప్రేరణ





**హనుమాన్ జంక్షన్, మార్చి 4, మేజర్ న్యూస్ :** విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి పట్టుదలతో చదువుకుని భావి భారత పౌరులుగా ఎదగాలని వెలుగుల సురేష్ పిలుపునిచ్చారు. హనుమాన్ జంక్షన్‌లోని విశ్వకవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఇటీవల రజతోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆ సందర్భంగా బుధవారం గుడివాడ రోడ్డులోని పాఠశాల ఆవరణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

పాఠశాల ప్రిన్సిపాల్ కొమ్మినేని అనిత, కరస్పాండెంట్ కొమ్మినేని ముఖర్జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో ఎస్ఐ సురేష్, ఎస్ఐ లంక సత్యకళ, సీనియర్ జర్నలిస్టు తాడి రంగా రావు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ, "జీవితంలో 16 సంవత్సరాలు కష్టపడి చదివితే, మిగిలిన 60 సంవత్సరాలు సుఖమయంగా గడుస్తాయి" అని అన్నారు. చదువుకోవాల్సిన సమయాన్ని వృథా చేయకుండా, మార్కుల కోసమే కాకుండా జ్ఞానం కోసం చదవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన మాటలను పాటిస్తూ 90 మందిలో ఒకడిగా కాకుండా 10 మందిలో ఒకడిగా నిలవాలని విద్యార్థులకు హితవు పలికారు. ఎస్ఐ లంక సత్యకళ విద్యార్థులకు పోక్సో యాక్ట్ గురించి వివరంగా అవగాహన కల్పించారు. గుడ్ టచ్‌బ్యాడ్ టచ్ గురించి తెలియజేసి, డ్రగ్స్ వంటి దురవలాలకు దూరంగా ఉండాలని సూచించారు. తాత్కాలిక ఆనందం కోసం జీవితాన్ని ప్రమాదంలో పెట్టకూడదని హెచ్చరించారు. కార్యక్రమం ముగింపులో పాఠశాల యాజమాన్యం అతిథులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.

# ఫలించిన విజయవాడ ఎంపీ చిన్ని కృషి



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ రహదారుల అభివృద్ధిపై ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రత్యేక దృష్టి సారించారు. ఆ క్రమంలోనే సంబంధిత రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని పలుమార్లు ఎంపీ కేశినేని శివనాథ్ కలిసి విజ్ఞాపనలు అందజేశారు. ప్రత్యేకించి నందిగామ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలసి గత సంవత్సరం నవంబర్ 25వ తేదీన మంత్రి బిసి జనార్ధన రెడ్డిని సచివాలయంలో కలిసారు. నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం, అభి వృద్ధి పనులపై చర్చించి వినతి పత్రాన్ని అందజేశారు. నియోజకవర్గంలో ప్రస్తుత రహదారులు, వంతెనల పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. శిథిలావస్థలో ఉన్న ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో అనుసంధాన మార్గాలు, వంతెనల మరమ్మతుల అవసరాన్ని వివరించారు. ప్రజలకు సులభ రవాణా సౌకర్యం అందించాలంటే తక్షణమే రహదారుల నిర్మాణాలు, అభి వృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రోడ్లు కీలకమని, త్వరితగతిన పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అప్పట్లో మంత్రిని సచివాలయంలో నంది గామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్యతో కలిసి వెళ్లి విజ్ఞాపన అందజే శారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కృషి, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సహకారంతో తాజాగా నందిగామ

**నందిగామలో రహదారుల నిర్మాణానికి ఆర్ & బి శాఖ నుంచి రూ.240 లక్షల నిధుల మంజూరు చేసిన మంత్రి బీసీ జనార్ధన రెడ్డి**

**ఎంపీ విజ్ఞాపనకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం**

నియోజక వర్గంలో పలు అభివృద్ధికి ఆర్ & బి శాఖ నుంచి రూ.240 లక్షల నిధులను మంత్రి జనార్దన్ రెడ్డి మంజూరు చేస్తూ ప్రభుత్వపరంగా జీవో జారీ చేశారు. దెబ్బతిన్న రహదారుల అభివృద్ధికి పరిపాలనా అనుమతులు ఆర్ & బి శాఖ ద్వారా మంజూరు చేసినట్లు ఎంపీ కేసినేని శివనాద్ ( చిన్ని) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.డి.ఆర్, ఎస్.హెచ్ అప్‌గ్రేడేషన్ల కింద, రాష్ట్ర వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల మెరుగుదలకు సంబంధించి ప్రభుత్వ పరంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

**మంజూరైన పనుల వివరాలు**

రూ.210.00 లక్షల నిధులతో ఎన్‌హెచ్ 65 నుండి కంచికచర్ల ఎస్. అమరావరం రోడ్ (కిమీ 0.0 నుండి 5.3 వరకు), రూ.30.00 లక్షల నిధులతో ఎన్ హెచ్ 65 నుండి కంచెల రోడ్ (కిమీ 0/0 నుండి 6/8 వరకు) మొత్తం పొడవు: 6.800 కిమీ. మొత్తంగా రూ.240 లక్షల నిధులు నందిగామ నియోజకవర్గానికి కేటాయింపులు జరిగినట్లు తెలిపారు.

నందిగామ అభివృద్ధికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సంబంధిత రాష్ట్ర మంత్రి బి. సి.జనార్దన్ రెడ్డికు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివ నాథ్ ( చిన్ని ) ధన్యవాదాలు తెలిపారు. తన కృషితో పాటుగా స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య సహకారంతో మంత్రి జనార్దన్ రెడ్డిను పలుమార్లు కలవడంతో నిధులు మంజూరు జరిగినట్లు వివరించారు.

**నిధుల కేటాయింపుతో రహదారుల సత్వర అభివృద్ధి**

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వపరంగా నిధులు కేటాయింపుల ద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు సమకూరనున్నాయి. వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్య రంగాలకు రహదారుల నిర్మాణంతో పురోగతి సాధ్యపడుతుంది. పార్లమెంటు నియోజకవర్గ పరిధి లోని అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# ఘనంగా అద్దంకి నాంచారమ్మ జాతర మహోత్సవం

**అమ్మవారికి మండలి వెంకట్రామ్ పూజలు**





**మోపిదేవి మేజర్ న్యూస్ :** కోరిన కోర్కెలు తీర్చే దైవంగా భక్తుల పూజలు అందుకుంటున్న పెద ప్రోలు శ్రీ అద్దంకి నాంచారమ్మ తల్లి అమ్మవారి ఆలయ వార్షిక జాతర మహోత్సవం బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కమిటీ పెద్దల ఆహ్వానం మేరకు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను, అవనిగడ్డ లంకమ్మ దేవస్థానం చైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామిని అద్దంకి నాంచారమ్మ ఆలయ కమిటీ ఆలయ కమిటీ కార్యదర్శి కే.వీ.ఎన్.కే కోటేశ్వరరావు దంపతులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, పార్టీ నాయకులు కూరేటి రాఘవ, యడ్ల పల్లి లక్ష్మణరావు, ఆకుల అజయ్ కుమార్, శ్రీపతి సోమేశ్వరరావు, యడ్లపల్లి నాగమల్లేశ్వరరావు, యన్నం పవన్ సాయి కృష్ణ, యన్నం నాగార్జున, యడ్ల శేషు, గౌరం హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయంను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి





**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని 2వ వార్డులో గల అయ్యప్ప స్వామి ఆలయంను సందర్శించిన అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు, బుధవారం అయ్యప్ప స్వామి జయంతి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమం, స్వామివారి విగ్రహానికి పాలాభిషేకం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సిబ్బంది సింహాద్రి రమేష్ బాబుని, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోడూరు జడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, కోడూరు మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిశే మాధవరావు, కోడూరు 1వ సెగ్మెంట్ ఎంపీటీసీ, కోడూరు టౌన్ వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు బడే హేమ గంగాధర్, వైఎస్ఆర్సీపీ జిల్లా కార్యదర్శి గుర్రం బసవయ్య, బట్టు వేణు 2వ వార్డు మెంబర్, వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెన్న ప్రసాద్, కోడూరు గ్రామ వైఎస్ఆర్సీపీ చేనేత విభాగం అధ్యక్షులు ఆకురాతి తాతయ్య వైఎస్ఆర్సీపీ నాయకులు కోట సుబ్రమణ్యం, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

**తిరు నక్షత్ర పూజలో విక్కుర్తి శ్రీనివాసరావు**

**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు అయ్యప్పస్వామి దేవాలయం వద్ద తిరునక్షత్ర పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ పూజలకు విక్కుర్తి శ్రీనివాసరావు విచ్చేసి



స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బడే భావనారాయణ నరసింహారావు దుశ్శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

## కృష్ణా కలెక్టర్, ఎస్పీని అవమానించిన కార్తికేయను విధులు నుండి తప్పించాలి

**మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నీతి, నిజాయితీతో ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ జిల్లా ప్రజల మన్ననలు పొందుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ డీ.కే బాలాజీని, శాంతి భద్రతల పరిరక్షణలో అగ్ర భాగాన ఉన్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌ను గన్నవరం ఎయిర్పోర్ట్‌లో అవమానించిన ముఖ్యమంత్రి కార్యదర్శి కార్తికేయ ఐఏఎస్ ను తక్షణమే విధుల నుండి తప్పించాలని, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. అలాగే బేషరతుగా "కార్తికేయ" కలెక్టర్ కి, ఎస్పీ కి క్షమాపణ కూడా చెప్పాలని అన్నారు. బుధవారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్తికేయ చర్యలను బాలాజీ తీవ్రంగా ఖండించారు. బాధ్యత గల పదవిలో ఉన్న వ్యక్తి బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం సబబుగా లేదని బాలాజీ సూచించారు. జిల్లా కలెక్టర్ వారి డ్రెస్ కోడ్ గూర్చి మాట్లాడే హక్కు కార్తికేయకు లేదన్నారు. జిల్లా కలెక్టర్ కు కొరియర్ లో బూట్లు పంపడం కార్తికేయ ఆహంభావానికి, అహంకారానికి, పరాకాష్ట అని అన్నారు. అన్ని రంగాలలో జిల్లాను అభివృద్ధి పదంలో, అగ్ర భాగాన నడిపిస్తూ నిజాయితీ అధికారిగా పేరు తెచ్చుకుంటున్న డీకే బాలాజీ ని, అలాగే జిల్లా ఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి శాంతి భద్రతలు కాపాడుతూ ప్రజలకు కొండంత ధైర్యాన్ని అందిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌ను కూడా అవమానించడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. కార్తికేయ అసభ్య పదజాలం ఉపయోగించడం కృష్ణా జిల్లా ప్రజలను అవమానించినట్టేనని అన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ లకు తక్షణమే కార్తికేయ క్షమాపణలు చెప్పాలని, తక్షణం వారిని పదవి నుండి బదిలీ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను లంకి శెట్టి బాలాజీ డిమాండ్ చేశారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



**గన్నవరం, మార్చి 4, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం గన్నవరం గ్రామంలో కళాకారుల ఆధ్వర్యంలో కళాజాతర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై కలిగే అనర్థాలను నాటికలు, పాటలు ద్వారా ప్రజలకు వివరించారు. అలాగే లైంగిక వేధింపులు, మత్తు పదార్థాలు, మత్తు పానీయాల వినియోగం యువత జీవితాన్ని దెబ్బతీస్తుందని తెలియజేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం సర్పంచ్ సౌజన్య, వైద్యాధికారి డాక్టర్ సృజన, ప్రజారోగ్య నర్స్ వి.కే.ఎన్ జయలక్ష్మి, అంగన్వాడి సూపర్వైజర్ పద్మావతి, సీడీపీవో, అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, వాటి వల్ల బాలికల ఆరోగ్యం, భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని తెలిపారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం లేదా ఆడ శిశువు అని ముందుగా తెలియజేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. అలాగే పనిచేసే ప్రదేశాల్లో మహిళలు లేదా బాలికలపై లైంగిక వేధింపులు జరిగితే వాటిని నిరోధించేందుకు కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని, బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలు, యువతలో బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత అవగాహన ఏర్పడింది.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999